సూరత్‌కు దగ్గర్లోని సిమ్లాక్ అనే ఊరిలో పుట్టాడు సులేమాన్ ఆడమ్. వాళ్ల అమ్మ.. 'సోలీ' అని ముద్దుగా పిలుచుకునేది. ఇంట్లో వాళ్లూ అలాగే పిలిచేసరికి.. అదే అసలు పేరుగా స్థిర పడి పోయింది. సోలీ వాళ్ల తాత ఇబ్రహీం ఆడమ్. ఇంటి దగ్గర పిండిమిల్లు నడిపేవాడు. అతనికి ఆరుగురు కొడుకులు, ఒక కూతురు. ఆడబిడ్డ లాహోర్ నగరం లోని ఓ సంపన్న కుటుంబానికి కోడలిగా వెళ్లింది. వాళ్లకు ఫ్యాక్టరీలు ఉండేవి. సోలీ వాళ్ల నాన్న, బాబాయిలు.. ఆ ఫ్యాక్టరీలలో కొన్నాళ్లు పనిచేశారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.

ఇండియా నుంచి పాకిస్థాన్ విడిపోయింది.

ఆ సమయంలోనే సోలీ వాళ్ల నాయనమ్మ చనిపోయింది. తాత మరో పెళ్లి చేసుకోవడంతో.. ఆ ఇంట్లో ఉండటానికి సయీద్, అతని సోదరులకు ఇబ్బందిగా అనిపించింది. చిన్న కొడుకు మినహా మిగతావాళ్లంతా.. లాహోర్‌కు వెళ్లిపోయారు. అక్క ఇంటి తలుపు తట్టారు. కొన్నాళ్లు అక్కడే పని చేశారు. అయితే, కంపెనీల్లో ఉండే సాధారణ తనిఖీలు సయీద్‌కి నచ్చలేదు. ఆత్మాభిమానం అడ్డుపడి.. మనసు సొంతూరి మీదికి మళ్లింది. ఇంటి (ఇండియా)కి తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. భార్యాపిల్లల్ని వెంటబెట్టుకుని, చెప్పాపెట్టకుండా బొంబాయి చేరుకున్నాడు. అక్కడి నుంచి ఇంటికి ఫోన్ చేస్తే.. 'ఇక్కడ పరిస్థితులు బాగా లేవు. మీరు వస్తున్నట్టు ఎవరో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మీరు డామన్ వెళ్లండి' అని చెప్పాడు ఇబ్రహీం. చేసేది లేక 1950లో పోర్చుగీసువారి పాలనలో ఉన్న డామన్ చేరుకుంది ఆ కుటుంబం. అక్కడ దొరికిన పనిచేస్తూ ఉండేవాడు సయీద్. తండ్రి కూడా అప్పుడప్పుడూ డబ్బు పంపేవాడు.



గుజరాత్‌లోని సిమ్లాక్ గ్రామంలో సోలీ ఆడమ్ పుట్టిన ఇల్లు



పెట్రోల్ బంకులో సోలీకి చిరుకానుక ఇస్తున్న సునిల్ గవాస్కర్, గుండప్ప విశ్వనాథ్, దిలీప్ వెంగ్‌సర్కార్, సురు నాయక్




సోలీ ఆడమ్.. బియాండ్ బౌండరీస్ ఆవిష్కరణలో సునీల్ గవాస్కర్, దిలీప్ వెంగ్‌సర్కార్ తదితరులు..



భార్య మరియంతో

### ఎడారి బతుకు

'ఇక్కడి పరిస్థితులు బాగున్నాయి. మీరు ఇంటికి రండి' అంటూ ఒకనాడు తండ్రి కబురు పంపాడు. 1952లో సయీద్ కుటుంబం సొంతూరికి చేరుకుంది. అక్కడ కొన్ని నెలలు సోలీ జీవితం సంతోషంగా గడిచింది. చెల్లెలు, ఇరుగుపొరుగు స్నేహితులతో ఆడుతూపాడుతూ ఉండేవాడు. ఓరోజు పోలీసులు వచ్చారు. 'మీరంతా సూరత్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయాలి' అని హుకుం జారీచేసి వెళ్లిపోయారు. పోలీస్ స్టేషన్‌లో సంతకాలు పెట్టి వద్దామని అందరూ బయల్దేరారు. అప్పుడు.. మధుబాల, దిలీప్ కుమార్ నటించిన 'ఆన్' సినిమా విడుదలైంది. సూరత్ వెళ్లాక ఆ సినిమా చూడాలని అనుకున్నారంతా. పోలీస్ స్టేషన్‌కి చేరుకొని సాయంత్రం దాకా ఎదురు చూశాక.. ఇన్స్‌పెక్టర్ వచ్చాడు. 'మీలాగా అటు నుంచి ఇటు వచ్చిన వాళ్లందరినీ వెనక్కి పంపిస్తున్నాం. ఏమీ అనుకోవద్దు!' అని చెప్పి.. అందరినీ ఓ ట్రక్కు ఎక్కించాడు. సరిహద్దుకు సమీపంలోని ఎడారిలో వదిలేశారు. చేతిలో కట్టుబట్టలు తప్ప ఇంకేమీ లేవు. దప్పిక, ఆకలి.. దారిలో ఎవరైనా తారసపడితే ప్రాధేయపడి దాహం తీర్చుకున్నారు. ఆ ఎడారిలో నాలుగు రోజులు నడుచుకుంటూ కరాచీ చేరుకున్నారు.

### దేశం కాని దేశంలో..

జేబులో పైసా లేదు. నడిచి నడిచీ అలసిపోయి ఉన్నారు. తలదాచుకోడనికీ దిక్కులేదు. కరాచీలో కనికరించినవాళ్లు లేరు. దీంతో అక్కడి నుంచి మళ్లీ లాహోర్‌కి పయనమయ్యారు. సయీద్ సోదరి మంచి మనసుతో వారిని ఆదరించింది. తమ్ముడి కుటుంబానికి ఆశ్రయమిచ్చింది. తమ్ముణ్ని మళ్లీ పనిలో పెట్టించింది. అక్కడ రెండేళ్లు గడిచాయి. సయీద్‌కు ఇంకో ఇద్దరు పిల్లలు పుట్టారు. మళ్లీ అదే సమస్య. ఆత్మాభిమానం అడ్డుపడింది. 1954 నాటికి భార్యాపిల్లలతో మళ్లీ కరాచీ చేరుకున్నాడు. గుజరాతీలు ఎక్కువగా ఉండే నదిమాబాద్‌లోని ఓ భవనం మెట్ల కింద.. చిన్నగదిని అద్దెకు తీసుకున్నాడు. దాదాబాయి అల్యూమినియం ఫ్యాక్టరీలో నెలకు 90 రూపాయల జీతానికి పనిలో కుదిరాడు. ఇంట్లో కనీసం బాత్రూమ్ సౌకర్యం కూడా లేకపోవడంతో.. డ్రైనేజ్ హోల్ ఓపెన్ చేసి మలమూత్ర విసర్జన చేసేవాళ్లు. అపరిశుభ్రత కారణంగా జబ్బుపడి.. చిన్న పిల్లలిద్దరూ చనిపోయారు. శ్మశానానికి పోతే స్థానికులు అడ్డుకున్నారు. ఆ దయనీయ స్థితిలో స్థానిక గుజరాతీ ముస్లింలు కొంత స్థలం కొంటే.. పిల్లల్ని అందులో ఖననం చేశారు. అప్పుడే.. వాళ్లందరూ కలిసి 'గుజరాతీ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ'ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలోనే దక్షిణాఫ్రికా నుంచి ఇద్దరు సంపన్న దంపతులు ఆ ప్రాంతానికి వచ్చారు. వాళ్లు కూడా గుజరాతీ మూలాలున్నవాళ్లే. ఫ్యాక్టరీ కార్మికుల కోసం 'నతాల్ రెసిడెన్షియల్ కాలనీ' పేరుతో ఇండ్లు నిర్మించారు. అందులో ఒక ఇంటిని సయీద్‌కి కేటాయించారు. అక్కడే సోలీకి తమ్ముడు పుట్టాడు. సోలీ బాబాయిలు కూడా లాహోర్‌ని విడిచిపెట్టి కరాచీ వచ్చేశారు. దొరికిన పనులు చేసుకుంటూ కుటుంబాల్ని పోషించుకున్నారు.

### సీనియర్ టీమ్‌లో జూనియర్ కెప్టెన్!

నతాల్ కాలనీలో బడికి వెళ్తూ క్రికెట్ ఆడేవాడు సోలీ. ఆ కాలనీ క్రికెట్ క్లబ్‌లో ఎక్కువగా పెద్దవాళ్లే ఆడేవాళ్లు. పదేళ్ల వయసులోనే సోలీ ఆ క్లబ్‌లో చేరాడు. అయితే, చిన్నవాడని తనకు అవకాశాలు ఇచ్చేవాళ్లు కాదు. దాంతో ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా ఉండేవాడు. క్రికెట్ ఆడాలన్న ఆరాటంతో.. నతాల్ కాలనీ జూనియర్స్ క్రికెట్ క్లబ్‌ను ఏర్పాటు చేశాడు సోలీ. సోలీ మంచి ఆటగాడని పేరొచ్చాక.. సీనియర్ క్లబ్‌లో అవకాశాలు దక్కాయి. తొమ్మిదో తరగతి చదివేనాటికి ఆ జట్టుకి కెప్టెన్ కూడా అయ్యాడు. ఒకసారి సోలీ మేనత్త ఆయేషా.. ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లింది. అక్కడ సామాజిక పరిస్థితులు, పని